క్లుప్తంగా

విద్యుత్ ప్రమాదాలపై విస్తృత అవగాహన



విద్యుత్ ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలపై విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కడప కార్పొరేషన్: విద్యుత్ ప్రమాదాల నివారణకు ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యుత్ ప్రమాదాలు జరక్కుండా విద్యుత్ శాఖ సిబ్బంది ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తూ ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో బొమ్మలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలు విద్యుత్ భవన్ కార్యాలయంతోపాటు జిల్లాలోని డివిజన్ కార్యాలయాలు, పెద్ద సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది, ప్రజలు ఆ ఫ్లెక్సీల్లో పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తే చాలా వరకూ విద్యుత్ ప్రమాదాలు తగ్గే అవకాశముంది.

అంటు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్: వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ సూచించారు. గురువారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ఎక్కువగా వస్తాయన్నారు. వాటి నివారణకు పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చని వివరించారు. అలాగే వర్షాకాలంలో వచ్చే రకరకాల అంటువ్యాధులు, వాటి లక్షణాలు, నిరోధక చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అంటువ్యాధుల నుండి రక్షణ పొందడానికి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ రమేష్ యాదవ్, శివరామకృష్ణతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సుభాష్‌చంద్రబోస్

కడప అర్బన్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలని రిమ్స్ ఎస్‌ఐ సుభాష్‌చంద్రబోస్ సూచించారు. గురువారం కడప నగరంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఎస్‌ఐ వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు నడిపేటపుడు సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్‌లో సెల్ ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఒక కుటుంబం ఆర్థికంగా ఎంతో నష్టపోతుందని, కుటుంబ పెద్ద తీవ్రంగా గాయపడితే కుటుంబ సభ్యుల మనో వేదన వర్ణణాతీతమన్నారు. ఇలాంటి దుస్థితి ఎవ్వరికీ రాకూడదన్నారు. అందరూ తమ వంతు బాధ్యత గా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని సుభాష్ చంద్రబోస్ విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగాన్ని కాలరాస్తున్న బీజేపీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని కాలరాస్తోందని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ కు పెరుగుతున్న బలం, పొందుతున్న ప్రజల మద్దతును చూసి బీజేపీ భయపడుతోందన్నారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు.

అభినందన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు హర్యానాలోని కురుక్షేత్రలో జరగనున్న కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ సెలక్షన్‌కు కడప విద్యార్థులు పదిమంది ఎంపికైన సందర్భంగా గురువారం కడప డీఈవో కార్యాలయంలో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కడప నుండి నేషనల్ సెలక్షన్స్ కు ఎంపికైన అను ఏంజెల్, మేఘన, మెగస్య, సోను పవన్, వజ్ర దత్తు, అబ్దుల్లా ఖాన్, తన్విత్ తాక్షి, సోమశేఖర్ రెడ్డి, యశ్వంత్ కుమార్, కనిష్క లను జాతీయస్థాయిలో మెడల్ సాధించి మన జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి, కోచ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.









ఇందిరానగర్‌లో సమస్యల తిష్ట

రిమ్స్ సమీపంలో ఉండే ఇందిరా నగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి.
ఏడాదిగా నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లు మురికి వాడలా మారాయి. మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఇక్కడి సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అలాగే ఇక్కడ కుక్కలు, పందుల బెడద ఎక్కువ ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

క్రమశిక్షణతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఈదురు బాషా

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురు బాషా అన్నారు. గురువారం కడప మండలం ఆలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు పోక్సోచట్టం, పిల్లల భద్రత, బాల్య వివాహాల నివారణ, ఈజ్ టీవింగ్ అండ్ వేధింపుల తోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి సమాజానికి, దేశానికి సేవ చేయాలన్నారు. అలాగే తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చేలా కృషి చేయాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపై, యువతపై ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి అని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పోలీసులు అందిస్తున్న సేవల పట్ల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మునిరత్నమ్మతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎంపీఐ జాతీయ కన్వీనర్ గంగాధరన్

కడప ఎడ్యుకేషన్: దేశంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇంత వరకు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తాత్సారం చేస్తోందని రెవల్యూషనరీ మార్క్సిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌ఎంపీఐ) జాతీయ కన్వీనర్ గంగాధరన్ డిమాండ్ చేశారు. గురువారం కడప రవీంద్ర నగర్‌లో రెవల్యూషనరీ మార్క్సిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ కన్వీనర్ గంగాధరన్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను అణచివేస్తూ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతులను ముంచే ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి దాదాపు 15 సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాన్ని పెంచుతున్నారన్నారు. అలాగే డీఎస్సీలో అవకతవకలు జరిగినా ఏమాత్రం చలనం లేకుండా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, ఏపీ రాష్ట్ర కార్యదర్శిలు వెంకటేశన్, రమణయ్య, రాష్ట్రదర్శి కార్యవర్గ సభ్యులు అబ్దుల్ ఆలం, నాగరాజు,లెనిన్, కమిటీ సభ్యులు శేషు, ప్రతిభ, చలపతి, గంగమ్మ, హిరణ్య తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరం సి పి బ్రౌన్‌లో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనిచేయకపోవడంతో డాక్టర్ రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు ఏజెన్సీలపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సిపి బ్రౌన్ లో 2018లో ఎస్ ఏ సి ఇన్నా భారత్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. అయితే అప్పటినుండి లిఫ్ట్ పనిచేయకపోవడంతో పలుమార్లు వారికి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో సిపి బ్రౌన్ మెంబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత నియామకాలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2025 అభ్యర్థులకు సంబంధించిన మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత సెలక్షన్ లిస్ట్ ప్రకటించి నియామకాలు జరపాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కడపలోని జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ 2025 నియామకాలకు సంబంధించి మెరిట్ లిస్ట్ ముందు ప్రకటించి తర్వాత సెలక్షన్ జాబితా విడుదల చేయాలని కోరారు. కానీ నేరుగా సెలక్షన్ జాబితా ప్రకటించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయడం సరికాదన్నారు. నేరుగా సెలక్షన్ జాబితా విడుదల చేయడం జరిగితే రిజర్వ్ కేటగిరీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా అభ్యర్థులకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. మెరిట్ లిస్ట్ ప్రకటించి అన్ని రిజర్వ్ కేటగిరీలకు కటాఫ్ మార్కులు తెలియజేసిన అనంతరం నియామకాలు చేపట్టేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నంద్యాల రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వితరణ

కడప ఎడ్యుకేషన్: కడప చెమ్మియాపేట బాలుర పాఠశాలకు రామాపురం మండలం నీలకంఠరావు హైస్కూల్ హెడ్‌మాస్టర్ వనజారెడ్డి రూ. 40 వేలు విలువ చేసే టేబుల్ టెన్నిస్ బోర్డును వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి హాజరై టేబుల్ టెన్నిస్ బోర్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ అండ్ పీడీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సాజిత్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వాడితే నేలకు నష్టం



మాట్లాడుతున్న కడప డివిజన్ సహాయ సంచాలకులు సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: రైతన్నలు రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల నేలకు నష్టం జరుగుతుందని కడప డివిజన్ వ్యవసాయ సంచాలకులు సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని పెండ్లిమర్రి, ఖాజీపేట, చింతకొమ్మదిన్నె, ఒంటిమిట్ట మండలాలకు సంబంధించిన గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపైన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కడప అగ్రి హోమ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలు తెలియజేసారు.

ప్రకృతి వ్యవసాయ కడప జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం వలన నేలతో పాటు ప్రకృతికి ఏ విధంగా నష్టం వాటిల్లుతుందో తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి నేల సారవంతతను ఏవిధంగా కాపాడుకోవచ్చునో తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ జిల్లా మేనేజర్ వసంత కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయపద్ధతులను స్వయం సహాయక బృందాల ద్వారా రైతులకు తెలియజేయాలని తెలిపారు. అలాగే 365 రోజుల పంటల సరళిని తెలిపారు. పెండ్లిమర్రి ప్రకృతి వ్యవసాయ సిఆర్‌పి గంగిరెడ్డి మాట్లాడుతూ జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానం గురించి తెలియ చేశారు. వీటి వాడకం ద్వారా పంటలను తెగుళ్ళ నుంచి కాపాడుకోవడానికి సర్వరోగ నివారిని లాగా పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైవీయూ అభివృద్ధికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ. 100 కోట్ల నిధులు కేటాయించాలని, నిర్మాణ దశలో ఆగిపోయిన భవనాలను పూర్తి చేయాలని ఈ విషయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం వైవియులోని మేనేజ్మెంట్ బ్లాక్ వద్ద విద్యార్థులతో భారీగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధి జరిగి ఇక్కడి విద్యార్థులు ఉన్నస్థాయికి వెళ్లాలంటే అది వైవీయు అభివృద్ధితోనే సాధ్యం అన్నారు. అనేక విషయాల్లో మంచి పరిశోధనలు, బోధన ఉన్నా కూడా నిధుల కొరతతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం లేదన్నారు. వైవీయులో ప్రధాన పరిపాలన భవనం, మేనేజ్మెంట్ భవనాలు, హాస్పిటల్, ప్రహరీ ఇలా అన్ని కూడా నిర్మాణ దశలో ఆగిపోయాయని అన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వైవీయు కు నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీనికోసం ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్ యూనివర్సిటీ కన్వీనర్ నరసింహులు, నాయకులు మనోజ్, గణేష్,గోవర్ధన్, బాషా, బాబాయ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై నిర్లక్ష్యం వహించరాదు



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు సుధ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎలక్ట్రానిక్ వ్యర్థాల పట్ల ప్రజలు నిర్లక్ష్యాన్ని వీడడంతోపాటు వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు సుధ కురుబ పిలుపునిచ్చారు. గురువారం కడప నగరం మానస ఇన్ హోటల్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సీపీసీబీ అనుమతించిన ప్రొడ్యూసర్ రెస్పాన్స్‌బిలిటీ ఆర్గనైజేషన్ హుల్లాడెక్ రీసైక్లింగ్ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఈ-వేస్ట్ పరిస్థితిని వివరిస్తూ సక్రమ రీసైక్లింగ్ వల్ల పర్యావరణ, ఆర్థిక ప్రయోజనాలను తెలియజేశారు. చివరగా ఆంధ్రప్రదేశ్‌లో సుస్థిరమైన ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణను బలోపేతం చేయాలని, శుభ్రమైన, పచ్చని పర్యావరణ నిర్మాణం వైపు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ కడప ప్రాంతీయ కార్యాలయ అధికారి శ్రీనివాసమూర్తి, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ చాంద్‌బాషతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన పరిశ్రమలు, బ్రాండెడ్ సంస్థల యజమానులు పాల్గొన్నారు.

డీసీఈబీ హాల్ నిర్మాణానికి సహకరించండి



జెడ్పీ సీఈఓ ఓబులమ్మకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లాలో పదివేల మంది ఉపాధ్యాయులు ఉన్నారని, వారికి సంబంధించిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ (డీసీఈబీ)కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని జెడ్పీ సీఈఓ ఓబులమ్మను కడప జిల్లా ఎస్ టి యు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్ రెడ్డిలు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై గురువారం ఆమెను జెడ్పీ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1997లో డీసీఈబీని నిర్మించారన్నారు. ఈ డీసీఈబీ హాల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పరీక్షల నిర్వహణ ప్రశ్నాపత్రాల రూప కల్పన, ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ విద్యారంగ సమస్యలపైన సమావేశాల నిర్వహణ జరిగేదన్నారు. కానీ ప్రస్తుతం డీసీఈబీ హాల్ లేక ఉపాధ్యాయులకు విద్యాశాఖ మండల, జిల్లా అధికారులకు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. పైగా నిధుల సమస్య కూడా లేదు కాబట్టి కామన్ ఎగ్జామినేషన్ బోర్డు హాల్ నిర్మాణానికి సహకరించాలని తదనుగుణంగా ఆదేశాలు ఇవ్వాలని యస్.టీ.యు నాయకులు కోరారు. అలాగే ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ నాన్ రిఫండ్ లోన్‌కు సంబంధించి చాలా తక్కువ శాతం లోను మంజూరు చేస్తున్నారని అలా కాకుండా ఉపాధ్యాయుల ఖాతాలో ఉన్న సొమ్ములో 75% లోను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయుల పి.యఫ్ ఫైనల్ పేమెంట్ల చెల్లింపులో జరుగుతున్న తీవ్రమైన జాప్యాన్ని నివారించేలా సిబ్బందికి సూచించాలని కోరారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించడం ద్వారా అద్భుతమైన విజయాలను సాధించగలరని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు ఒత్తిడి నిర్వహణ అనే అంశంపై నెలరోజుల పాటు వాణిజ్య శాస్త్ర విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సులభంగా అధికమించగలరని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పాటలు, సంగీతం, ఆటలు పని ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయని అన్నారు. ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించినప్పుడే వారు జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని అన్నారు. సర్టిఫికెట్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ యోగ, మెడిటేషన్ ద్వారా విద్యార్థులు ఒత్తిడిని అధిగమించవచ్చని అన్నారు.

ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మధుసూదన, అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, రెడ్డి బాష, లావణ్య, మంజు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్‌ను వినియోగించుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెడుతున్న ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్‌ను జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ టెలికాం సర్కిల్‌లో కేవలం రూ.400కే 20 ఎంబిపిఎస్ వేగంతో అపరిమిత ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్ , 400 పైగా ఫ్రీ చానల్స్ తో పాటు దాదాపు అన్ని తెలుగు పే చానెల్‌లను 44 చానల్‌లను వీక్షించవచ్చన్నారు. లోకల్ కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్‌లో టిప్‌గా నమోదు చేసుకొని ఇప్పటికే ఉన్న ఏపీఎస్ఎఫ్ఎల్ కస్టమర్లను మార్చవచ్చన్నారు. ఆసక్తి గల కేబుల్ ఆపరేటర్లు కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, రాయచోటి పట్టణాలలో తమకు సమీపంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ డివిజనల్ కార్యాలయం, లేదా కడప నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రేపటి నుంచి పైన తెలిపిన కార్యాలయాల్లో టిప్, ఎల్‌సివో మేళాలు నిర్వహించనున్నామన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులతో పోస్టులను భర్తీ చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో ఉన్న ఖాళీ పోస్టులన్నీ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులతోనే భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యుఈయు సీయూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పైన ప్రతి కార్మికుడు సంతకాల సేకరణ చేసి ముఖ్యమంత్రికి సెప్టెంబర్ ఫస్ట్ వీక్ లో ఇవ్వనున్నామన్నారు. ఖాళీ పోస్టులన్నీ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులతోనే భర్తీ చేయాలన్నారు. ఆ తర్వాతనే మిగతా పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి రిక్రూట్‌మెంట్ చేసుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలో యు ఈ సి ఈ యు జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి రమేష్, సాయి, సుబ్బరాయుడు, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు ,పెద్దయ్య, హరి నాథ్, డివిజన్ కార్యదర్శి పి సి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన మంటలు



షార్ట్ సర్క్యూట్‌తో నల్లగా మారిన డీఏఓ కార్యాలయంలోని డీఏఓ గది

కడప అగ్రికల్చర్: కడప కలెక్టరేట్ ఆవరణంలోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం సాయంత్రం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ)రూములోని ఏసీతోపాటు పలు కంప్యూటర్స్, లైట్లు కాలిపోయినట్లు తెలిసింది. మొదటగా వ్యవసాయ అధికారి గదిలోని ఏసీలోని తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో రూములో మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా డీఏఓ రూమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతోపాటు వ్యవసాయాధికారి కార్యాలయంతోపాటు పక్కనే ఉన్న జిల్లా కోఆపరేటివ్ కార్యాలయంలోని పలు కంప్యూటర్లు కాలిపోయినట్లు తెలిసింది. దీంతో పాటు రెండు కార్యాలయాల్లో విద్యుత్‌లైట్లు కూడా కాలిపోయి పనిచేయకుండా పోయినట్లు సిబ్బంది తెలిపారు. కాకపోతే షార్ట్ సర్క్యూట్ జరిగిన సమయంలో డీఏఓ ఆఫీస్ రూములో లేదని తెలిసింది. దీంతో ఎవరికీ అపాయం జరగలేదని తెలిసింది.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో సత్తా



పీజీ విద్యార్థిని డాక్టర్ భువనేశ్వరిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ జమున

కడప అర్బన్: తిరుపతిలో నిర్వహించిన 2025 ఏపీ స్టేట్ పల్మనాలజీ అసోసియేషన్ సమావేశం (ఏపీఎస్‌పీ సిఓఎన్- 2025)లో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల రెండవ సంవత్సరం పీజీ పల్మనాలజీ విద్యార్థిని డాక్టర్ భువనేశ్వరి ప్రథమ బహుమతి సాధించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ నూకరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ , ఇతర అధ్యాపకులు ఆమెను అభినందించారు. విద్యార్థులు అంకితభావంతో చదువుతున్నారని, వారి ప్రతిభను గుర్తించి మరింత ప్రోత్సాహం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ జమున పేర్కొన్నారు.